సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023

చీనీ టన్ను రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 31 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.

టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.7°/22.3°
జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ ఉద్యోగాలకు నోటిఫికేషన్



పుట్టపర్తి అర్బన్: వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ ప్రాజెక్టుల పరిధిలో 5 అంగన్‌వాడీ కార్యకర్తలు, 5 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 55 సహాయకుల పోస్టులు కలిపి మొత్తంగా 65 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. దరఖాస్తులు ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరిస్తామన్నారు. 1 జూలై 2022 నాటికి 21– 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వ్ చేసిన స్థానాల్లో ఆయా కేటగిరీల్లో 21 ఏళ్లు నిండిన వారు లేకపోతే 18 ఏళ్లు నిండిన వారూ అర్హులేనన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.11,500, మినీ కార్యకర్తలకు, సహాయకులకు రూ.7 వేల చొప్పున గౌరవ వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఆయా ప్రాజెక్టుల్లోని సీడీపీఓలను సంప్రదించాలన్నారు.

పోస్టుల ఖాళీలు ఇలా...
ధర్మవరం ప్రాజెక్టులో 2, సీకేపల్లి ప్రాజెక్టులో 8, మడకశిర ప్రాజెక్టులో 11, హిందూపురం ప్రాజెక్టులో 8, కదిరి ప్రాజెక్టులో 7, పెనుకొండ ప్రాజెక్టులో 6, నల్లచెరువు ప్రాజెక్టులో 1, గుడిబండ ప్రాజెక్టులో 3, సోమందేపల్లి ప్రాజెక్టులో 10, పుట్టపర్తి ప్రాజెక్టులో 3, ఓడీచెరువు ప్రాజెక్టులో 6 పోస్టులు కలిపి మొత్తంగా 65 ఖాళీలు ఉన్నాయి.

ఆరు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు


- సౌకర్యాలు లేని కేంద్రాలను గుర్తించండి
- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా కొత్తగా ఆరు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. భవనాల మార్పుకు 38, పోలింగ్ కేంద్రం పేరు మార్పుకు 45 ప్రతిపాదనలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. బుధవారం ఆయన ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నియోజక వర్గాల ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే కనీసం 1,500కుపైగా ఓటర్లు ఉండాలన్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా మార్పు చేయనున్న పోలింగ్ కేంద్రాల వివరాలను ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన సమావేశంలో తెలిపామన్నారు. ఇందులో ఎలాంటి సందేహాలున్నా గురువారం లోపు తెలపాలన్నారు. ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్ మాట్లాడుతూ... జిల్లాలో 1,555 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. 22వ తేదీన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, నియోజక వర్గాల ఈఆర్‌ఓలు తిప్పేనాయక్, భాగ్యరేఖ, రాఘవేంద్ర, చిన్నయ్య, ఆయా మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల డీటీలు మైనుద్దీన్, భాస్కర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా మాణిక్యాలరావు



అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.మాణిక్యాలరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఓబీజీ విభాగాధిపతిగా ఉన్న మాణిక్యాలరావున పదోన్నతిపై (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) ఖాళీగా ఉన్న అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి ఎస్పీఎం ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు. త్వరలో ఆమెకు పదోన్నతి రానుందని వైద్య కళాశాల వర్గాలు తెలిపాయి.

● వినాయకా సెలవిక



రొళ్ల: ఎం రాయాపురంలో వినాయక నిమజ్జన దృశ్యం



పుట్టపర్తి: నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు

పుట్టపర్తి టౌన్: మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు బుధవారం గంగ ఒడికి చేరాడు. జిల్లా కేంద్రం పుట్టపర్తితో పాటు కదిరి, హిందూపురం, మడకశిర, ధర్మవరం తదితర పట్టణాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. శోభాయాత్ర సందర్భంగా మేళతాళాలు, డప్పు దరువులతో యువత చిందులేశారు. పలుచోట్ల లడ్డూల వేలాలు జరిగాయి.



చిలమత్తూరు: శోభాయాత్రలో భాగంగా హుస్సేన్‌పురంలో నృత్యం చేస్తున్న యువతులు

రయ్ రయ్



రోడ్లపై బైక్‌లు దూసుకెళ్తున్నాయి. ఒకదానిని మించి మరొకటి పోటీ పడుతున్నాయి. వేగం.. మైలేజీ.. స్టైల్.. ప్రత్యేక ఫీచర్లతో కూడిన బైకులను వివిధ కంపెనీలు తయారుచేసి మార్కెట్లోకి తెచ్చాయి. వినియోగదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో బైకుల అమ్మకాలు జోరందుకున్నాయి. షోరూముల్లోకి అలా రాగానే.. ఇలా కొనుగోలు చేసి రోడ్లపై రయ్‌మని తిప్పుతున్నారు.

- ద్విచక్ర వాహనాల విక్రయాల జోరు..
- 100 సీసీ దాటిన టూవీలర్లకు గిరాకీ
- ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 5వేల వాహనాల రిజిస్ట్రేషన్
- బైక్‌ల అమ్మకం టర్నోవర్ ఏడాదికి రూ.500 కోట్లకు పైనే

ఉమ్మడి జిల్లాలో అమ్మకాలు

నెలకు సగటున టూవీలర్ అమ్మకాలు
5,000

ఏడాదికి సగటు అమ్మకాలు
60,000

ఏడాదికి అమ్మకాల టర్నోవర్
రూ.**500** కోట్లు పైనే

ఒక్కో బండి సగటు కనిష్ట ధర
రూ.**1,00,000**



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ద్విచక్ర వాహనాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డిమాండు భారీగా ఉండటంతో ఆటోమొబైల్ రంగంలో టూవీలర్ అమ్మకాలు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కార్ల అమ్మకాలు దూకుడు పెరిగిన విషయం తెలిసిందే. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా ద్విచక్రవాహనాల వ్యాపారం రూ.500 కోట్లకు పైగా జరుగుతున్నట్టు అంచనా. తాజా పరిస్థితులు, మార్కెట్‌లో అమ్మకాలు చూస్తుంటే 100 సీసీ బైకులు తక్కువ అమ్ముడుపోతున్నాయి. బైకు కెపాసిటీ 100సీసీ దాటిందంటే లక్ష రూపాయలు పైన చెల్లించాల్సిందే.

భారీగా పెరిగిన వాహనాల ధరలు
గతంలో బీఎస్4 మోడల్ వాహనాలు ఉండేవి. కాలుష్యం నియంత్రించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వచ్చే వాహనాలు ఏవైనా బీఎస్6 (భారత్ స్టేజ్ ఎమిసన్ స్టాండర్డ్ 6)కు ఉండాలని నిర్దేశించింది. దీంతో ఒక్కో వాహనంపై సగటున రూ.15వేలు పెరిగినట్టు డీలర్లు చెబుతున్నారు. వాహనాల తయారీలో గతంతో పోలిస్తే టెక్నాలజీ కూడా మారింది. స్పీడు మొదలుకొని అన్నీ డిజిటల్ కొలమానాలే వచ్చాయి. దీంతో టూవీలర్ సామాన్యులకు కాస్త దూరం జరుగుతున్నట్టు తెలుస్తోంది.

గేర్‌లేని వాహనాలకూ భారీ గిరాకీ
గేర్ వాహనాలకే కాదు గేర్ లేని స్కూటీలాంటి వాహనాలకూ భారీగా గిరాకీ పెరిగింది. యాక్టివా, జూపిటర్, యాక్సెస్ వంటి వాహనాలు ఏవైనా లక్ష రూపాయలు పైనే ఉన్నాయి. మరోవైపు 350 సీసీ వాహనాలైన రాయల్ ఎన్‌ఫీల్డ్, హోండా హైనెస్ వంటి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. 350 సీసీ వాహనం కనిష్టం రూ.2.50 లక్షలు పలుకుతోంది. కాలేజీ కుర్రాళ్లు ఎక్కువ మంది 350 సీసీ వాహనాలపై మక్కువ చూపుతున్నారు.

మార్కెట్‌లో వివిధ రకాల ద్విచక్ర వాహనాల తాజా ధరలు ఇలా

కేటగిరీ	ధర (రూ.)
హోండా షైన్ 125 సీసీ	1,12,000
యూనికార్న్ 150 సీసీ	1,50,000
బజాజ్ పల్సర్ 125 సీసీ	1,20,000
బజాజ్ పల్సర్ 150 సీసీ	1,48,600
బజాజ్ పల్సర్ 200 సీసీ	1,75,000
హీరో స్ప్లెండర్ ప్లస్ 100 సీసీ	98,500
హీరో సీడీ డీలక్స్ 100 సీసీ	85,000
టీవీఎస్ జూపిటర్ 125 సీసీ	1,18,000

బీఎస్6కు మారడంతో రేట్లు పెరిగాయి



బీఎస్4 నుంచి బీఎస్6కు మారడంతో ఒక్కో వాహనంపై సగటున రూ.15 వేలు పెరిగింది. ప్రస్తుతం వస్తున్న వాహనాల్లో ఏదైనా సమస్య వస్తే కంప్యూటర్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. దీనివల్ల మార్కెట్‌లో ఈ వాహనాలకు డిమాండ్ పెరిగింది.
– మల్లికార్జున, హోండా కంపెనీ డీలర్

కాలుష్య నియంత్రణలో భాగంగానే..



కొత్తగా వచ్చిన బీఎస్6 వాహనాలకు రేట్లు బాగా పెరిగాయి. గతంలో కంటే ఇంజిన్‌లో ప్రత్యేకతలు వచ్చాయి. కాలుష్య నియంత్రణలో భాగంగా ఇలా చేశారు. దీనివల్ల ఏ వాహనం తీసుకున్నా కనిష్టంగా లక్ష రూపాయలు తక్కువ లేదు.
– వీర్రాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

దండిస్తే.. దాడి చేశారు!

- దొరిగిల్లు క్వార్టర్స్‌లో దారుణం
- వినాయకుడి విగ్రహం ఎదుట యువకుల బైక్ విన్యాసాలు
- అడ్డుచెప్పిన గ్రామస్తులపై దాడి.. ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు



అనంతయ్య (ఫైల్)

ముదిగుబ్బ: వినాయకుడి విగ్రహం ఎదుట బైక్‌లతో విన్యాసాలు ఏమిటని ప్రశ్నించిన వారిపై దాడి చేయగా ఒకరు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి మండల పరిధిలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వినాయక పండుగ సందర్భంగా దొరిగిల్లు క్వార్టర్స్‌లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు యువకులు విగ్రహం ఎదుట బైక్‌పై విన్యాసాలు చేశారు. దీంతో గ్రామస్తులు యువకులను మందలించారు. దీంతో సదరు యువకులు దొరిగిల్లు గ్రామంలోకి వెళ్లి వారి కుటుంబ సభ్యులు, బంధువులను తీసుకొచ్చారు. అక్కడే ఉన్న గ్రామస్తులతో ఘర్షణ పడ్డారు. మాటామాటా పెరగడంతో ఇరువర్గాలూ కర్రలతో దాడి చేసుకున్నాయి. ఈ ఘటనలో అనంతయ్య (55) అనే వ్యక్తి తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ముదిగుబ్బకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘర్షణలోనే గాయపడిన ఆంజనేయులు, నారాయణమ్మ, తులసి, నాగముణమ్మ, వెంకటనారాయణను చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యతీంద్ర, లా అండ్ ఆర్డర్ సీఐ హేమంత్‌కుమార్ అర్ధరాత్రి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బుధవారం ఉదయం అడిషనల్ ఎస్పీ విష్ణు దొరిగిల్లు క్వార్టర్స్‌కు చేరుకొని ఘర్షణకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో 13 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఐ కరుణాకర్ బెదిరిస్తున్నారు

- డబ్బులు తీసుకుని మాపై దౌర్జన్యం చేస్తున్నాడు
- ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన రొద్దం మండలం పెద్దకోడిపల్లి మహిళలు
- న్యాయం చేయాలని ఉన్నతాధికారుల ఎదుట వేడుకోలు

సాక్షి, పుట్టపర్తి



ఇరువర్గాల మధ్య గొడవ (ఫైల్)

శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు అధికారి భిన్నంగా వ్యవహరిస్తున్నాడని, సివిల్ పంచాయితీలో జోక్యం చేసుకుని తమను ఇబ్బంది పెడుతున్నాడని రొద్దం మండలం పెద్ద కోడిపల్లికి చెందిన అనిత, నాగరంగమ్మ, చిట్టి, అపర్ణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమపై రుబాబు చేస్తూ.. ముడుపులు ముట్టజెప్పిన వారి వైపు నిలుస్తున్నారని, న్యాయం అడిగిన తమను 'చెప్పినట్లు వినకుంటే స్టేషన్‌కు ఎత్తుకెళ్లి తాట తీస్తా. నాకే ఎదురు మాట్లాడుతావా.. నీ అంతు చూస్తా..'అంటూ దౌర్జన్యం చేశాడని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

అసలు సంగతి ఇదే..
రొద్దం మండలం పెద్ద కోడిపల్లికి చెందిన అనిత, నాగరంగమ్మ, చిట్టి, అపర్ణ తదితరుల నివాసాల నుంచి గడ్డి వాములకు వెళ్లేందుకు గ్రామకంఠం దారి ఎప్పటి నుంచో ఉంది. అయితే మూడేళ్లుగా అదే గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి దారి కోసం వదిలిన భూమి తనదేనని చెబుతున్నాడు. ఈ దారిలో ఎవరూ నడవకుండా ఆంక్షలు విధిస్తున్నాడు. అంతేకాకుండా ఓ పట్టా తీసుకొచ్చి కోర్టులో పిటిషన్ వేశాడు. దీంతో సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అయితే సదరు మహిళలు రెవెన్యూ కార్యాలయంలో విచారణ చేయగా, నరసింహులు నకిలీ పట్టా సృష్టించినట్లు తేలింది. దీంతో టీడీపీ మద్దతుదారుడైన నరసింహులు పెనుకొండ సీఐ కరుణాకర్‌ను ఆశ్రయించాడు. విషయం కోర్టు పరిధిలో ఉన్నా సీఐ కరుణాకర్ జోక్యం చేసుకుని దారిలో వెళ్లకూడదని మహిళలను గట్టిగా హెచ్చరించారు. దీంతో వారు దిక్కు తోచని స్థితిలో బుధవారం ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ మాధవరెడ్డి అందుబాటులో లేకపోవడంతో డీఎస్పీ (ఏఆర్) విజయ్‌కుమార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇంటికి వెళ్లేందుకు దారి లేకుండా చేస్తోన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ నాయకుల అండతో పెద్ద కోడిపల్లి గ్రామానికి చెందిన నరసింహులు.. గ్రామకంఠం భూమికి నకిలీ పట్టా సృష్టించి పెనుకొండ సీఐ కరుణాకర్‌ను తమపై ఉసిగొల్పుతున్నారని తెలిపారు. అయితే తాను ఎస్పీకి విషయం చెబుతానని.. సోమవారం 'స్పందన'లో మరోసారి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ విజయ్‌కుమార్ వారికి చెప్పి పంపించారు.

టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు



గ్రామంలో కొందరు పనిగట్టుకుని మాకు దారి లేకుండా చేయాలని చూస్తున్నారు. నకిలీ పట్టా సృష్టించి పోలీసులను అడ్డు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నామని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గొడవల్లో మహిళలు అని కూడా చూడకుండా టీడీపీ నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారు. – అనిత

మహిళలని కూడా చూడలేదు



మా ఇంటి నుంచి గడ్డి వాములోకి వెళ్లేందుకు దారి లేకుండా చేశారు. దారికి అడ్డంగా బండలు పాతడానికి వచ్చారు. మా ఇంట్లో మగవారు లేకపోవడంతో అడ్డగించాం. మహిళలు అని కూడా చూడకుండా చితకబాదారు. రొద్దం పోలీసులకు ఫిర్యాదు చేశాం. సీఐ జోక్యంతో రొద్దం పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మా ఫిర్యాదు కూడా స్వీకరించలేదు. – అపర్ణ

నరసింహులు నుంచి ప్రాణహాని ఉంది



నకిలీ పట్టా సృష్టించి.. కోర్టులో పిటిషన్ వేశారు. రెవెన్యూ అధికారులు పట్టా రికార్డుల్లో లేదని తేల్చి చెప్పారు. కొందరు టీడీపీ నేతల అండతో నరసింహులు వర్గీయులు మాపై దాడి చేసే అవకాశం ఉంది. అతని నుంచి ప్రాణహాని ఉంది. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – నాగరంగమ్మ

సీఐ అండతో రెచ్చిపోతున్నారు



శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులే అవినీతి పరులకు మద్దతు పలుకుతున్నారు. స్థానిక పోలీసులపై నమ్మకం లేక ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాం. పెనుకొండ సీఐ కరుణాకర్ అండ చూసుకుని మా గ్రామంలో నరసింహులు వర్గీయులు రెచ్చిపోతున్నారు. ఎస్పీ గారు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాం. – చిట్టి

జనమే చెప్పుతో కొడతారు జాగ్రత్త!

- టీడీపీ, జనసేన నేతలకు శంకరనారాయణ హెచ్చరిక
- పూర్తి ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు
- టీడీపీ ఆందోళనలు చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టు తర్వాత టీడీపీ నాయకులు చట్ట వ్యతిరేక చర్యలకు దిగారని, అమాయకులైన కార్యకర్తలను రెచ్చగొట్టి వారిని హింసాత్మక ఘటనలకు ప్రేరేపిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. బుధవారం ఆయన పెనుకొండలోని స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అక్రమాలకు సంబంధించిన పూర్తి ఆధారాలు బయటపడడంతోనే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. అందుకే న్యాయస్థానం కూడా ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. కానీ టీడీపీ నేతలు మాత్రం ఆకాశం కూలిపోయినట్లు, భూమి బద్ధలైనట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నేతల చర్యలన్నీ జనం గమనిస్తున్నారని, ఇంకా ఎక్కువ చేస్తే జనమే చెప్పులతో కొడతారన్నారు. అలాగే న్యాయాధికారులు, న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులపై సుమోటో కింద కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ప్రజల తరఫున కోరుతున్నానన్నారు. ఇదే కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబు, ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఘంటా సుబ్బారావును అరెస్ట్ చేసే విషయం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఈకేసు దర్యాప్తు చేస్తున్న సంస్థలు సమర్పించిన ప్రాథమిక సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకుని న్యాయమూర్తి తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరు అరెస్ట్ అవుతారో విచారణలో తేలుతుందన్నారు. చంద్రబాబు అరెస్ట్ అనంతరం కొందరు రోడ్లపైకి వచ్చి హడావుడి చేస్తున్నారని, వారంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. ఆ సామాజికవర్గంలోని పెద్దల ప్రోద్బలంతోనే చాలా మంది వాస్తవాలు తెలుసుకోకుండా రోడ్లెక్కుతున్నారన్నారు. ఈ అనవసరపు ఆందోళనలు చూస్తుంటే టీడీపీ నాయకులకు చట్టంపై, న్యాయంపై గౌరవం లేదన్న విషయం అర్థమవుతోందన్నారు. న్యాయమూర్తులను బెదిరించాలన్న ధోరణి టీడీపీ నాయకుల్లో కనిపిస్తోందన్నారు. స్కిల్ స్కాం వల్ల శిక్షణ అందక నష్టపోయిన యువత చాలా ఆగ్రహంగా ఉన్నారని, ఆందోళన పేరుతో రోడ్డెక్కే నాయకులకు తప్పక బుద్ధి చెబుతారన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయమన్నారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన నాయకులు తమ అనైతిక కార్యకలాపాలను మానుకోకపోతే రాష్ట్ర ప్రజలు చీపుర్లు, చెప్పులతో కొట్టే కాలం దగ్గర్లోనే ఉందన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్ ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, రామాంజనేయులు, కోఆప్షన్ మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కదిరి విద్యార్థికి రాష్ట్రస్థాయి అవార్డు



గాయత్రి

కదిరి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ క్రెడిట్ కో–ఆపరేటివ్ (సీసీఎస్) ఆధ్వర్యంలో అందజేసే రాష్ట్ర స్థాయి అవార్డుకు కదిరి డిపోలో కండక్టర్ గంగాప్రసాద్ కుమార్తె గాయత్రి ఎంపికయ్యారు. బీఏ పరీక్షల్లో 963/1000 మార్కులు సాధించి ఆమె టాపర్‌గా నిలిచారు. ఈ నెల 29న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సీసీఎస్ 68వ మహాసభల్లో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకోనున్నారు. ప్రతిభ చాటుకున్న గాయత్రిని కదిరి డిపో సిబ్బంది హరి మోహన్, హరిత, రామకృష్ణ, బైరిశెట్టి, ఉత్తన, రవీంద్ర తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

నిమజ్జనంలో ఘర్షణ .. యువకులపై దాడి

పెనుకొండ రూరల్: వినాయకుడి నిమజ్జనంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కోనాపురానికి చెందిన రమణ బుధవారం చేపట్టిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమానికి ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లాడు. అయితే అక్కడ ముగ్గురు యువకులు వాగ్వా దానికి దిగి రమణపై దాడి చేశారు. ఘటనలో తీవ్ర గాయాలైన రమణను స్థానికులు వెంటనే పెనుకొండలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు.

• మరువపల్లి గ్రామానికి చెందిన వడ్డి వెంకటేష్ అదే గ్రామంలో బుధవారం చేపట్టిన వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్నాడు. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ఘర్షణ పడ్డారు. రాత్రి వెంకటేష్ తన ఇంట్లో ఉండగా యువకులు దౌర్జన్యంగా లోపలకు చొరబడి విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకోబోయిన వెంకటేష్ తల్లి రామలక్ష్మిపై సైతం దాడి చేయడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం

అనంతపురం సిటీ: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఉదయం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్‌కు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడం శుభ పరిణామమన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం దక్కాలని ఆకాంక్షించారు. 2027 నుంచి కాకుండా 2024 ఎన్నికల్లోనే రిజర్వేషన్‌ను అమలులోకి తీసుకువస్తే బాగుంటుందన్నారు. మహిళల స్థితిగతులు మెరుగుపడితేనే సమాజాభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం వైఎస్ జగనన్న.. నామినేటెడ్ పదవులతో పాటు ప్రత్యక్ష ఎన్నికల్లో ఏకంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం 30 శాతం రిజర్వేషన్‌కు చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

దోసిత్తనంపై అద్భుతం

- సూక్ష్మ కళలో రాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్ వివేకానంద
- గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నం
- ఇప్పటికే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుకు చేరువగా







దేశవిదేశాలకు చెందిన నాణేలను పరిశీలిస్తున్న వివేకానంద, దోస విత్తనంపై చిత్రీకరించిన మూత్రపిండ వ్యవస్థ, అగ్గిపెట్టె సైజులో రాసిన భగవద్గీత

కళ్యాణదుర్గం: బియ్యపు గింజలు... సుద్దముక్కలు.... సబ్బు బిళ్లలు... పెన్సిళ్లు... కాదేదీ కళకు అనర్హం అన్నట్టు తన సూక్ష్మ కళతో ఆర్టీసీ కండక్టర్ వివేకానంద అద్భుత చిత్రాలు ఆవిష్కరిస్తున్నారు. అక్షరాలను సూక్ష్మంగా రాస్తూ మైక్రో ఆర్టిస్ట్‌గా అవతారమెత్తి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కోసం ప్రయత్నిస్తున్నారు. దోసకాయ విత్తనాలతో పాటు బియ్యం గింజలపై 189 తెలుగు అక్షరాలు, వందేమాతర గీతం, వేమన పద్యాలు రాసి అందరి చేత ప్రశంసలు అందుకున్నారు. దోసకాయ విత్తనాలపై గాంధీ, మూత్ర పిండాల వ్యవస్థ, తాజ్‌మహల్, ఏసు శిలువ, పడవ, గుడిసె తదితర బొమ్మలను చిత్రీకరించారు. బియ్యపు గింజపై సెలవుచీటి రాసి అందరినీ అబ్బురపరిచారు. సుద్దముక్కపై సైన్స్‌కు సంబంధించిన అనేక అంశాలతో పాటు జంతువుల బొమ్మలూ వేశారు. అగ్గిపుల్ల, నారు పోగులపై ఏ నుంచి జెడ్ వరకూ ఆంగ్ల అక్షరాలు లిఖించి ఆకట్టుకున్నారు. అలాగే పురాతన నాణేల సేకరణపై సైతం మక్కువ పెంచుకున్న ఆయన ఇప్పటి వరకూ భారతదేశంతో పాటు బెల్జియం, జర్మనీ, ఆఫ్ఘనిస్తాన్, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాలకు చెందిన సుమారు 300కు పైగా నాణేలు సేకరించారు.

గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకునేలా

కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన ఎం.వివేకానంద కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. 1995లో డిగ్రీ చదువుతున్న సమయంలోనే సూక్ష్మ కళతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవచ్చునని తెలుసుకున్న వివేకానంద తాను కూడా మైక్రో ఆర్టిస్ట్‌గా రాణించాలని భావించారు. అప్పటి నుంచి తన సాధనను మొదలు పెట్టిన ఆయన సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో పోస్టుకార్డుపై 2,058 ఇంగ్లిష్ అక్షరాలతో 'జై సమైక్యాంధ్ర' అనే నినాదాన్ని ఏపీ చిత్ర పటం ఆకారంలో లిఖించారు. అగ్గిపుల్లలపై జై సమైక్యాంధ్ర నినాదాన్ని 76 అక్షరాలతో, బియ్యపు గింజపై 14 అక్షరాలతో రాశారు. ప్రస్తుతం ఆయన అగ్గిపెట్టెలో పట్టేంత చిన్నపాటి పుస్తకంలో భగవద్గీత రాస్తున్నారు. ఇప్పటి వరకూ 9 పర్వాలు పూర్తయ్యాయి. కాగా, 2 సెం.మీ. వెడల్పు, 3 సెం.మీ. పొడవు పరిమాణంలో ఉన్న పుస్తకంలో మాత్రమే భగవద్గీత రాసినట్లుగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ఉంది. ఈ రికార్డును అధిగమించేలా 1.8 సెం.మీ. వెడల్పు, 2.8 సెం.మీ. పొడవు (అగ్నిపెట్టె) పరిమాణంలో ఆయన భగవద్గీత రాస్తూ గత రికార్డును బద్దలుగొట్టే దిశగా ప్రయత్నిస్తూనే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌కు చేరువయ్యారు.

గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంటా



మనసుంటే మార్గం ఉంటుంది అనే నమ్మకంతో ముందుకు పోతున్నా. ఇప్పటి వరకూ దోస విత్తనాలు, బియ్యపు గింజలపై ప్రముఖుల చిత్రాలతో పాటు సైన్స్‌కు సంబంధించిన అంశాలను చిత్రీకరించాను. ప్రస్తుతం అగ్గిపెట్టెలో పట్టేంత పరిమాణమున్న పుస్తకంలో భగవద్గీత రాస్తున్నా. ఎలాగైనా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంటా.

– ఎం.వివేకానంద, ఆర్టీసీ కండక్టర్

నెమళ్ల వేటగాళ్ల అరెస్ట్



దొడ్డబళ్లాపురం (కర్ణాటక): జాతీయ పక్షి నెమళ్లను వేటాడుతున్న ఇద్దరిని బెంగళూరు వద్ద దొడ్డబళ్లాపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేసారు. పట్టుబడిన వారిని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన శ్రీనివాస్, బాలాజీగా గుర్తించారు. బతుకు తెరువు కోసం వలస వచ్చిన వీరు రైతుల తోటల్లో పనిచేస్తూ రాత్రి సమయంలో వన్యప్రాణులను వేటాడేవారు. మంగళవారం రాత్రి అరకుమల్లిగె చెరువు వద్ద మాటు వేసి నెమళ్లను వేటాడుతుండగా పోలీసులు పసిగట్టి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఓ నాటు తుపాకీ, మోపెడ్, మూడు నెమళ్ల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు.

గడువులోపు అర్జీలన్నీ పరిష్కరిస్తాం



'స్పందన'లో అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



'స్పందన'లో ప్రజలకు అర్జీలు రాసిస్తున్న అధికారులు

- మెరుగైన సేవలందించేందుకే మండల కేంద్రాల్లో స్పందన
- అధికారుల్లోనూ జవాబుదారీ తనం పెరుగుతుంది
- కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల: జగనన్నకు చెబుదాం పేరుతో మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న స్పందనలో అందే అర్జీలన్నీ సకాలంలో పరిష్కరిస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. బుధవారం ఆయనన గోరంట్ల మండల పరిషత్ ప్రాంగణంలోని వెలుగు కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో కలసి 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రజలకు మెరుగైన, పారదర్శక పాలన అందించడం కోసమే ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన'కు రాలేని వారి కోసమే మండల కేంద్రాల్లో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు మండల స్థాయి అధికారుల్లోనూ జవాబుదారీతనం పెంచడం కోసమే మండల స్థాయిలో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 152 అర్జీలు అందాయని, అందులో 75 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో తప్పులు సరిచేయాలని ఎక్కువ అర్జీలు అందాయన్నారు. ఆయ తర్వాత జాతీయ రహదారుల్లో భూములు కోల్పోయిన రైతులు పరిహారం పెంచాలని అర్జీలిచ్చారన్నారు. మిగతా 25 శాతం వివిధ సమస్యలకు సంబంధించి అర్జీలు ఇచ్చారన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి గడవులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు కలెక్టర్ అరుణ్‌బాబుకు గోరంట్ల ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్‌తో పాటు మండల స్థాయి అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ నవీన్, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, హౌసింగ్ పీడీ చంద్రమోళిరెడ్డి, డీపీఓ విజయకుమార్‌రెడ్డి, డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో 'షేరింగ్'

- నాలెడ్జ్ షేరింగ్, ట్రాన్స్‌ఫర్‌కు వీలుగా నిర్ణయం
- యూజీ, పీజీ, పరిశోధన కోర్సుల్లో అమలు



అనంతపురం: అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన, ఇతర అంశాల్లో విద్యా సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకునే (షేరింగ్) ధోరణికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శ్రీకారం చుట్టింది. 'నాలెడ్జ్ షేరింగ్ – నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్' నినాదంతో ఓ విద్యాసంస్థలోని టెక్నాలజీని, ఇతర వనరులను మిగిలిన సంస్థలు ఉమ్మడిగా వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలులోకి వస్తే సెంట్రల్ వర్సిటీలు సహా దేశంలోని అన్ని ఉన్నత విద్యా సంస్థల్లోని వనరులను సమీపంలోని వనరులు లేని ఇతర ఉన్నత విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ తమ విద్యార్థుల్లో నైపుణ్యాలు తీర్చిదిద్దేందుకు ఈ విధానం దోహదపడనుంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు పరిశోధన కోర్సుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

రెట్టింపు ఫలితాలు

యూజీసీ తీసుకున్న 'నాలెడ్జ్ షేరింగ్ – నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్' విధానం ద్వారా రెట్టింపు ఫలితాలు ఉంటాయని విద్యావేత్తలు అంటున్నారు. అకడమిక్ అంశాలు సహా ఏదైనా అభివృద్ధి కార్యకలాపాలను సమగ్రంగా అమలు చేయాలంటే అదనపు సదుపాయాలు అవసరమవుతాయి. ఇందుకోసం ఆయా సంస్థలు అదనపు పెట్టుబడి పెట్టాలి. అలా కాకుండా.. ఉన్నత విద్యా సంస్థలు పరస్పర సహకారంతో ఇప్పటికే అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే రెట్టింపు ఫలితాలు వస్తాయి.

సమానమైన విద్యను ఆర్జించేలా..

విద్యా పరమైన మౌలిక వనరులు పలు కళాశాలల్లో లేకపోవడంతో ఉన్న వనరులతోనే ఆయా కళాశాలలు నెట్టుకొస్తున్నాయి. దీంతో విద్యార్థులకు సమానమైన విద్య అందక నైపుణ్యాలు కొరవడి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇతర వనరులున్న సంస్థల్లో చదివే విద్యార్థులతో సమాన విద్యావకాశాలను అందిపుచ్చుకునేలా యూజీసీ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉన్న వనరులను పంచుకునేలా ఆయా సంస్థల మధ్య జరిగే ఒప్పందాలతో విద్యార్థులందరికీ మేలు చేకూరనుంది. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులన్నిటికీ ఈ విధానాన్ని అమలు చేయాలని యూజీసీ సూచించింది. ఆయా విద్యాసంస్థల్లో ఉన్న తరగతి గదులు, ల్యాబ్‌లు ఇతర వనరుల సమాచారాన్ని సమీపంలోని ఉన్నత విద్యాసంస్థలకు తెలిసేలా వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. వీటిని వినియోగించుకునే ఇతర ఉన్నత విద్యా సంస్థల నుంచి నిర్దిష్ట వనరులకు సాధారణ కనీస ఛార్జీలు నిర్ణయించి వసూలు చేయవచ్చునని సూచించింది. ఆ కనీస ఛార్జీల వివరాలూ అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

అవగాహన ఒప్పందాలతో ముందడుగు..

ఉన్నత విద్యా సంస్థల్లోని వనరులను పరస్పర భాగస్వామ్యంతో వినియోగించుకునేందుకు వీలుగా ఆయా సంస్థలు తొలుత అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని యూజీసీ సూచించింది. ఏ సమయంలో ఏ సంస్థ విద్యార్థులు వనరులు వినియోగించుకోవాలో సమగ్ర ప్రణాళికను రూపొందించి ఆ ప్రకారం కార్యచరణ అమలుకు కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర వనరులు పూర్తి స్థాయిలో వినియోగంచుకునేలా సంస్థలు చర్యలు చేపట్టాలని, ఏ ఒక్క తరగతి ఖాళీగా ఉంచకుండా చూసుకోవాలని యూజీసీ స్పష్టం చేసింది. అకడమిక్ అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ బోధనలు, వీడియోలు, లెర్నింగ్ మెటీరియల్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఇచ్చిపుచ్చుకోవచ్చునని పేర్కొంది. విద్యార్థుల నమోదు ప్రక్రియ మొత్తం ముందుగా ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫారమ్ ద్వారా పూర్తి చేయాలని, శిక్షణ, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించుకోవచ్చునని సూచించింది. పరిశోధన స్థాయిలో వనరుల భాగస్వామ్యం అనేది ఆయా పరిశోధకుల స్థాయిలో ఉండాలని, పీజీ స్థాయిలో వనరుల షేరింగ్ విభాగాల వారీగా లేదా సంస్థాగత స్థాయిలో ఉండొచ్చునని స్పష్టం చేసింది.

వినాయకుడి విగ్రహం పడి యువకులకు గాయాలు

పెనుకొండ రూరల్: వినాయకుడి విగ్రహం మీదపడడంతో పలువురు యువకులు గాయపడ్డారు. వివరాలు... పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లిలో బుధవారం సాయంత్రం వినాయకుడి ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. మార్గమధ్యంలో విద్యుత్ తీగలు తగలడంతో ఓ విగ్రహం మీదపడడంతో ఆ గ్రామానికి చెందిన మురళి, శ్రీనాథ్, రాము, మహేష్, నాగేంద్ర గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే పెనుకొండలోని సీహెచ్‌సీకి తరలించారు.

నడి రోడ్డుపై సమాధి!



నడి రోడ్డుపై మృతదేహాన్ని ఖననం చేసిన దృశ్యం

పావగడ: కొన్నేళ్ల పాటు పోరాటాలు సాగించినా శ్మశాన వాటికకు అనువైన స్థలాన్ని కేటాయించకపోవడంతో ఓ మృతదేహాన్ని నడిరోడ్డుపై ఖననం చేసి గ్రామస్తులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. వివరాలు... పావగడ తాలూకా నిడుగల్ హోబళికి చెందిన క్యాతగానహళ్లిలో గతంలో ప్రభుత్వ పోరంబోకు భూమిని శవ సంస్కారాలకు వినియోగించుకునే వారు. కొన్నేల్ల క్రితం ఆ భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారు. దీంతో మృతదేహాలను ఖననం చేసేందుకు స్థలం లేక గ్రామస్తులు పలుదఫాలుగా అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో గ్రామస్తులు విసిగిపోయారు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఈరణ్ణ మృతి చెందడంతో ఆయన దేహాన్ని తీసుకెళ్లి గ్రామ శివారున నడిరోడ్డుపై ఖననం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరదరాజు ఆగమేఘాలపై ఆ గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు.

సకాలంలో ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోండి



మొక్కజొన్న పంటలో ఈ క్రాప్ నమోదు పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

చిలమత్తూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను సకాలంలో ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని రైతులకు జిల్లా వ్యవసయాధికారి సుబ్బారావు సూచించారు. చిలమత్తూరు మండలం కోడూరు-1, 2 ఆర్‌బీకే పరిధిలో బుధవారం చేపట్టిన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదులో నిర్లక్ష్యంగా ఉండరాదని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, చిలమత్తూరు మండల వ్యాప్తంగా 8,382 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇప్పటి వరకూ 82 శాతం ప్రక్రియ పూర్తి కావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఓ వంశీకృష్ణ, ఆర్‌బీకే సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మడకశిర: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిరలోని 9వ వార్డు చావిడి వీధిలో నివాసముంటున్న అఖిల (29)కు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. భర్తతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిద్దాం

- ప్రార్థనా మందిరాల వద్ద సైలెంట్ జోన్
- నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తాం
- శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి




శాంతి కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ

కదిరి: చవితి రోజున కొలువుదీరిన గణనాథున్ని అందరం కలిసి ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేద్దామని ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలతో పాటు అన్ని మతాల వారు సహకరించాలని ఎస్పీ కోరారు. కదిరిలో ఈ నెల 22న వినాయక నిమజ్జనం నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం స్థానిక తాయీ గ్రాండ్‌లో డీఎస్పీ ఎం.శ్రీలత అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ... నిమజ్జనం రోజున వినాయక శోభాయాత్ర భక్తిభావంతో సాగాలన్నారు. ఆరోజు మద్యం దుకాణాలు, బార్‌లు మూసివేయాలని ఆదేశించారు. నిమజ్జనానికి సంబంధించి ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు... వారి పరిధిలో ఏర్పాట్లు చేయాలన్నారు. పట్టణంలో కొన్ని భారీ విగ్రహాలు ఏర్పాటు చేసినందున విద్యుత్ తీగలకు తగిలే అవకాశం ఉందని, అందువల్ల ఆ రోజు విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బంది కలగకుండా వీలైనంత వరకూ శోభాయాత్ర సూర్యాస్తమయంలోపే పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. ప్రార్థనా మందిరాల వద్ద సైలెంట్ జోన్‌ ఉంటుందని, అక్కడ నిశ్శబ్ద వాతావరణంతో విగ్రహాలు ముందుకు సాగిపోవాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. నిమజ్జనం జరిగే చోట ప్రాంతానికి చిన్న పిల్లలకు అనుమతి లేదన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, జిల్లాలో ఇంకా వివిధ ప్రాంతాల్లో వేర్వేరు తేదీల్లో గణేష్ నిమజ్జనాలు ఉన్నందున శుక్రవారం అయినప్పటికీ 22వ తేదీ కదిరిలో నిమజ్జనం చేయాల్సి వచ్చిందని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఘర్షణకు తావులేకుండా నిమజ్జనం జరగాలి

మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎంపీ కర్నల్ నిజాముద్దీన్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ముస్లిం మతపెద్ద షమీవుల్లా మౌలానా మాట్లాడుతూ... ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా గణేష్ నిమజ్జనం సాగేలా చూస్తామన్నారు. భవిష్యత్‌లో హిందూ, ముస్లింలతో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని గణేష్ నిమజ్జనం చేస్తామన్నారు. డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ...గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం అలంఖాన్‌వలీ మసీదు ముందు గుండా నాలుగు భారీ విగ్రహాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఆర్డీఓ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, ట్రాన్స్‌కో డీఈ షాజహాన్, ఆర్‌అండ్‌బీ డీఈ శైలజ మాట్లాడుతూ... నిమజ్జనానికి తమ శాఖల తరఫున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ గోపాలకృష్ణ పలువురు పట్టణ ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి



మృతిచెందిన విజయ్

బత్తలపల్లి: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. నీటి కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదులముష్టూరులో వినాయక చవితి వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తూ వచ్చారు. గ్రామానికి చెందిన బొలిగొండ లక్ష్మణ్ణ, లింగమ్మ దంపతుల ఏకైక కుమారుడు విజయ్ (18) తన స్నేహితులతో కలసి ఓ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువులో వినాయకుడి ప్రతిమను నిమజ్జనం చేస్తుండగా విజయ్ అదుపు తప్పి కుంటలో పడి బురదలో కూరుకుపోయాడు. రక్షించేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు, పోలీసులు స్పందించి వెలికి తీసేలోపు మృతి చెందాడు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు విజయ్ అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం.